### యౌవ్వనులకు మరియు పెద్దలకు

# మిషను పొలపు వార్తలు

## దక్షిణ ఆసియా-పసిఫిక్ డివిజను



### నాల్గవ త్రిమాసము

### అక్టోబరు, నవంబరు, డిశంబరు - 2025

అనువాదం :

**డాఫోడిల్ & ఎమరాల్డ్**





అక్టోబరు 25, 2025

# వెలుగు మరియు ఒక స్వరం

**ఆండ్రియెల్–బ్రెజిల్**

బ్రెజిల్‌లో కోవిడ్ పై నున్న ఆంక్షలు తొలగించుచున్న సమయంలో ఆండ్రియెల్ క్రైస్తవ పుస్తకాలు అమ్మడం కొరకు ఇంటింటికీ వెళ్ళుచున్నది. ఆమె ఒక గృహాన్ని చేరుకున్నప్పుడు, ఆ గృహాన్ని చూచి, అక్కడ తాను పుస్తకాలు అమ్మగలనను ఆశను కోల్పోయింది. ఆ గృహము చాలా పెద్దగా ఉన్నది. చుట్టూరా ఎత్తుగానున్న ప్రహరీగోడ కలిగిన ఒక పెద్ద భవనం కనుక, ఆ గోడ వెనుక భాగంలో ఉన్నదానిని చూడలేకపోయింది. ఇంటి యొక్క ప్రవేశ ద్వారము దగ్గర ఒక ఇనుపగేటు, పొడవైన పెద్ద పెద్ద చెట్లు ఉండటం ఆండ్రియల్ చూడగలిగింది.

అక్కడనుండి ఆమె వెళ్ళిపోవాలనుకున్నది. కాని గేటు దగ్గర ఉన్న డోర్‌బెల్ మ్రోగించాలన్న తలంపు ఆమెకు కలిగింది. తనలో కలిగిన బలమైన ఆ తలంపును తిరస్కరించలేకపోయింది. “ప్రభువా, నేను ఈ డోర్‌బెల్ మూడుసార్లు మ్రోగిస్తాను. కానీ ఇంటి బయటకు ఎవరూ రాకపోతే, నేను వెళ్ళిపోతాను. నేను చేయవలసింది చేస్తాను” అని మనసులో అనుకున్నది.

అప్పుడు మొదటిసారి డోర్‌బెల్ మ్రోగించింది. కొంతసేపు వేచి ఉన్నది. ప్రతిస్పందన లేదు. ఆమె మరలా డోర్‌బెల్ మ్రోగించింది. అయినా ప్రతిస్పందన లేదు. మూడవసారి డోర్‌బెల్ మ్రోగించింది. అప్పుడు, ఆ భవనం తలుపు తెరచి పొట్టిగా, తలనెరిసిన ఒక స్త్రీ బయటకు వచ్చింది. ఆండ్రియల్ ఆమెను చూచి, తన వద్దకు రమ్మని సైగ చేసింది. ఎందుకంటే, అది కోవిడ్ సమయం కాబట్టి ఎవ్వరూ, ఇతరులను తమ గృహాలలోనికి ఆహ్వానించరు. వారికి కోవిడ్ సోకుతుందనే భయంతో ఉంటారు.

అయితే ఆ స్త్రీ, ఆండ్రియల్ వైపు చూచి, చెయ్యి ఊపి, గేటు తెరచి, “దయచేసి లోపలికి రండి?” అని ఆహ్వానించింది. ఆమె ఆండ్రియల్‌ను ఎటువంటి ప్రశ్నలు అడుగలేదు. ఆండ్రియల్ తనను తాను పరిచయం చేసుకొని, తాను క్రైస్తవ పుస్తకాలు అమ్ముచున్నానని ఆమెకు చెప్పింది. ఆ స్త్రీ పేరు “హైదే” అని, ఆమె ఒక రిటైర్డు టీచరు అని, ఆమె భర్త ఆ పట్టణంలో అనేక ఆస్తులు కలిగిన ధనవంతుడైన భూస్వామి అని, ఆండ్రియల్ తెలుసుకొనెను.

ఆండ్రియల్ తన వద్ద ఉన్న క్రైస్తవ పుస్తకాల గురించి వివరించినప్పుడు ‘హైదీ’లో ఉన్న ఆసక్తిని చూచి, ‘క్రీస్తు విమోచన’ కథను మొదటి నుండి, చివరివరకు చెప్పింది. “పాపం ఈ లోకంలో ప్రవేశించిన తరువాత, క్రీస్తు శరీరధారిగా ఈ లోకమునకు వచ్చి, మన మధ్య ఆయన నివసించాడు. అన్నివిధములైన చెడులో నిండిన ఈ లోకంలో

జీవించడానికి ఆయన ఒక మానవుడిగా వచ్చాడు. మన పాపముల నిమిత్తము తన ప్రాణమును అర్పించాడు. మూడవ దినమందు పునరుత్థానుడై తిరిగి దేవుని యొద్దకు వెళ్ళాడు. ఆయన చేసిన సిలువ బలియాగము మనకు నిత్యజీవపు హక్కును అనుగ్రహిస్తున్నది. త్వరలోనే ఆయన మేఘములపై వచ్చి మనలను పరలోకమును కొనిపోవును. అక్కడ ఇక ఎన్నటికి వేదన, బాధ మరియు మరణం ఉండవు. నేను నిజంగా క్రీస్తుతో జీవించాలనుకుంటున్నాను. మీరు కూడా పరలోకంలో ఉండాలని నేను కోరుకుంటున్నాను. నేను మిమ్ములను పరలోకంలో కలుసుకోవాలనుకుంటున్నాను" అని ఆంద్రియల్ వివరించింది.

ఈ కథ వినిన తరువాత హైడీ ఏడవడం ప్రారంభించింది. ఆంద్రియెల్‌తో పంచుకొనుటకు తనకొక కథ ఉన్నది. "నువ్వు డోర్‌బెల్ కొట్టినప్పుడు, నేను నిన్ను లోపలికి రానివ్వాలని అనుకోలేదు. కానీ నేను తలుపు ద్వారా బయటకు చూచినప్పుడు, నీ చుట్టూరా ఒక వెలుగు ప్రకాశిస్తున్నట్లు చూచాను. మరియు ఒక స్వరం నాతో "ఆమెకు లోపలికి రానివ్వండి" అని చెప్పుటను విన్నాను. నేను, తెలియని వ్యక్తులను ఇంట్లోకి రానివ్వను. నేను గేటు ఎప్పుడూ తెరవను. కానీ వెలుగు మరియు స్వరం కారణంగా నిన్ను లోపలకు రానిచ్చును" అని హైడీ చెప్పింది.

హైడీ, ఎటువంటి ఆశలేని, కఠినమైన తన జీవితం గురించి ఆంద్రియల్‌తో మాట్లాడింది. ఆమెకు ఆస్తి, సంపద ఉన్నప్పటికినీ, ప్రేమ, శాంతి మరియు సంతోషము లేదనియు, నాలుగు సార్లు ఆత్మహత్యకు ప్రయత్నించానని, ప్రతిసారి ఆమె కుమారుడు తనను ఆపాడని చెప్పింది.

అప్పుడు ఆంద్రియల్ తనను డోర్‌బెల్ కొట్టడానికి ప్రేరేపించినది దేవుడే అని అర్థమైంది. ఆమె హైడీతో "ఎటువంటి సందేహం లేదు. నన్ను ఇక్కడకు పంపించింది దేవుడే. మీరు మీ జీవితం పట్ల ఆశ కలిగి ఉండేలా, క్రీస్తు అనుగ్రహించే రక్షణ బహుమతిని గురించి నేను మీకు చెప్పాలని ఆయన కోరుకున్నాడు" అని చెప్పింది.

ఆ రోజు నుండి, ఆంద్రియల్ మరియు హైడీ మంచి స్నేహితులు అయ్యారు. దేవుడు తనను ప్రేమించుచున్నాడనియు మరియు ఆయన కోసం తాను జీవించాలని ఆయన కోరుకొనుచున్నాడని హైడీ మొట్టమొదటిసారి గుర్తించిన రోజు అది.

క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్టు ఆఫరింగ్ అని కూడా పిలువబడే పదమూడవ సబ్బాతు కానుకల సహాయంతో బ్రెజిల్‌లోని చాలామంది ప్రజలు యేసుక్రీస్తు రెండవ రాకడకు సిద్ధం కావాలని ప్రార్థించండి. ఆంద్రియల్ నివసించే, బ్రెజిల్ ప్రాంతంలో ఉన్న పెర్నాంబుకానో ఎడ్వెంటిస్టు అకాడమీలో విద్యార్థుల కోసం ఒక చర్చిని నిర్మించుట కొరకు ఈ కానుకలలో కొంత భాగం సహాయపడుతుంది. ఈ ముఖ్యమైన ప్రాజెక్టు కొరకు ధారాళంగా కానుకలు సమర్పించుటకు ప్రణాళిక మీరు కలిగి ఉన్నందులకు మీకు కృతజ్ఞతలు.

–ఆంద్రూ మెక్ ఛెస్నీ